క్లుప్తంగా

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోండి



దుకాణదారుడికి కార్గో పార్సిల్ సర్వీసులపై అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ డీఎం నాగరాజు

నందికొట్కూరు: ఆర్టీసీ అందించే కార్గో పార్సిల్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీఎం నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవం సందర్భంగా దుకాణాల యాజమాన్యులకు కార్గో పార్సిల్ సర్వీస్‌లపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డోర్ డెలివరీ, కొరియర్ సౌకర్యం ఆర్టీసీ అందిస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు డోర్ డెలివరీ సౌకర్యం అందుబాటులో ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన సీపీఐ పోరాటం



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

పాములపాడు: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన పోరాటాలు చేస్తున్న పార్టీ సీపీఐ అని ఆ పార్టీ తాలూకా కార్యదర్శి ప్రతాప్ అన్నారు. ఆదివారం మండలంలోని బానకచెర్ల గ్రామంలో సీపీఐ శత వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పెద్ద రమణయ్య, సుధాకర్, లక్ష్మీపతి, సుంకన్న, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారుడికి జాతీయ ఆచార్య పురస్కారం



శ్రీను ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్, చిత్రలేఖన ఉపాధ్యాయుడు డాక్టర్ దేశెట్టిని సన్మానిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: బాలల చిత్రలేఖన పోటీల్లో 12 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించడానికి కృషి చేసిన శ్రీను ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్, చిత్రలేఖన ఉపాధ్యాయుడు డాక్టర్ దేశెట్టి శ్రీనివాసులుకు జాతీయ ఆచార్య పురస్కారం ఆదివారం నెల్లూరు పట్టణంలో అందజేశారు. అమీర్ ఆర్ట్స్ అకాడమీ 9వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన బాలల చిత్రలేఖనం పోటీల్లో నందికొట్కూరు పట్టణానికి చెందిన 12 మంది విద్యార్థులు బంగారు పతకాలు సొంత చేసుకున్నారు. విద్యార్థుల ప్రతిభ చాటిన సందర్భంగా ఉపాధ్యాయులు దేశెట్టికి అవార్డు అందించి ఘనంగా సన్మానించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

జూపాడుబంగ్లా: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని జూపాడుబంగ్లా ఎస్‌ఐ లక్ష్మీనారాయణ సూచించారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గతంలో చేసిన నేరాలను మనస్సులో పెట్టుకోకుండా సమాజంలో గౌరవప్రదంగా, ప్రశాంతంగా జీవించడం అలవర్చుకోవాలన్నారు. నేరప్రవృత్తిని వీడకుండా నిరంతరం నేరాలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదన్నారు. పీడీయాక్టు ప్రయోగించి గ్రామ, జిల్లా బహిష్కరణ చేయిస్తామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలిగే వారి వివరాలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి పేర్లు రౌడీషీట్ నుంచి తొలగించేందుకు కృషి చేస్తానన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కొత్తపల్లి: 2025 నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ ఎం.కేశవ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 31వ రోజు రాత్రి నుంచి 30 పోలీస్ ఆక్ట్ అమలు ఉంటుందని తెలిపారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులకు అందరు సహకరించాలని కోరారు. వేడుకలు చేసుకొనే వారు ముందుగా పోలీసుల పర్మిషన్ తీసుకోవాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణ తప్పనిసరి అని తెలిపారు. మ్యూజిక్ సిస్టమ్‌ను రాత్రి 10 తర్వాత వాడకూడదన్నారు. రాత్రి 10గంటల తర్వాత వాహనాల తనిఖీ ఉంటుందని, అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. ఆకతాయిలు, మితిమీరి ప్రవర్తించే యువతను, రోడ్లపై చిందులు తొక్కే మందుబాబులను, ఇష్టానుసారంగా వాహనాలు నడిపే వారిని చిత్రీకరించేందుకు వీడియో కెమెరాలు, డిజిటల్ కెమెరాలు ఉపయోగిస్తున్నామని చెప్పారు. శాంతిభద్రతలకు ఎవ్వరు విఘాతం కలిగించిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రైతన్నకు మిగిలింది కన్నీళ్లే!

- 2024లో అన్నదాతకు నష్టాలే
- అధిక వర్షాలకు దెబ్బతిన్న ఖరీఫ్, రబీ పంటలు
- అరకొరగా వచ్చిన పంటకు గిట్టుబాటు ధర కరువు
- మద్దతు ధర కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి
- అయినా స్పందించని కూటమి ప్రభుత్వం



భారీ వర్షాలకు నేలకొరిగిన మొక్కజొన్న పైరు (ఫైల్)



రబీలో మినుము పంటకు సోకిన తెగుళ్లు

ఆత్మకూరు: ఈ ఏడాది రైతన్నను కన్నీళ్లు పెట్టించింది. 2024లో రైతన్నల పరిస్థితి దారుణంగా మారింది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటలు ఆశాజనకంగా పండి రైతులు ఆనందంగా పొంగి పోతున్న తరుణంలో ఊహించని విధంగా అధిక వర్షాలు దెబ్బతీశాయి. ఎన్నడూ లేనివిధంగా రెండు పంటలు కూడా నష్టాలనే మిగిల్చాయి. కనీసం గిట్టుబాటు ధర కూడా దక్కలేదు. కూటమి ప్రభుత్వం ఆదుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కన్నీళ్లు మిగిల్చిన ఖరీఫ్

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులను కన్నీళ్లు పెట్టించింది. మే నెలలో వర్షాలు కురవడం ప్రారంభం కావడంతో అన్నదాతలు ఎంతో సంబరపడి ముందస్తు పంటల సాగుకు సిద్ధమయ్యారు. మే చివరి వారం, జూన్ తొలి వారంలోనే విస్తారంగా మొక్కజొన్న, పత్తి, మెట్ట వరి పంటలను రైతులు సాగుచేశారు. వేసిన ఈ పంటలకు వరుణుడు ఆగ్రహానికి గురికావడంతో పైర్లు దారుణంగా దెబ్బతిన్నాయి. ఒక్క ఆత్మకూరు డివిజన్‌లో మొక్కజొన్న 17 వేల హెక్టార్లు, మెట్ట వరి 6 వేల హెక్టార్లు, పత్తి 2 వేల హెక్టార్లలో, కంది 1000 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. రికార్డుస్థాయిలో సాధారణ వర్షపాతం కంటే రెండు నుంచి మూడింతల వర్షాలు కురవడంతో పంటలు పంట పొలాల్లో కుళ్లిపోయాయి. దీంతో కోట్లాది రూపాయల నష్టాలను రైతులు చవి చూశారు.

రబీ సీజన్‌లో..

రబీ సీజన్ వాస్తవానికి ప్రతి ఏడాది అక్టోబర్ నుంచి నవంబర్ 15వ తేదీ వరకు కాలం ఉంటుంది. ఈ సీజన్‌లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆరుతడి పంటలపై మొగ్గుచూపారు. డివిజన్‌లో రైతులు మినుము, మొక్కజొన్న, పొగాకు, ఎండు మిర్చి, కంది పంటలు సాగు చేశారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లో కూడా వర్షాలు ఏమాత్రం తగ్గలేదు. డిసెంబర్ రెండో వారం వరకు కూడా అడపాదడపా వర్షాలు కురవడం, ఆకాశం మేఘామృతం కావడంతో రబీ సీజన్‌లో ఈ పంటలకు చీడపీడలు అధికమయ్యాయి. దీంతో రైతులు క్రిమి సంహారక మందులను పిచికారీ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో పంటలు భారీగా దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల విత్తు మొలిచినా పైరు ఎదగకపోవడంతో చెడగొట్టి రెండోసారి విత్తు వేయాల్సిన దుస్థితి ఏర్పడింది. వరుసగా రెండు సార్లు విత్తు వేసిన రైతులకు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.40 వేల దాకా ఖర్చు అయ్యింది. దీంతో అన్నదాతలు ఆర్థికంగా నష్టపోయారు.

పంటలకు గిట్టుబాటు కరువు

వర్షాలకు పంటలు భారీగా దెబ్బతినడంతో పాటు రైతులు పండించిన వరి, మొక్కజొన్న, పత్తి, మిర్చి, కంది పంటలకు గిట్టుబాటు ధరలు కూడా కరువయ్యాయి. గతేడాది 75 కిలోల బస్తా నంద్యాల సోనమసూరి రకం ధాన్యం రూ.2,100 నుంచి రూ.2,300 దాకా ధర పలికింది. ఈ ఏడాది కేవలం రూ.1,300 నుంచి రూ.1,450లోపే ధర వచ్చింది. మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలిస్తే గతేడాది క్వింటాల్ రూ.1,900 నుంచి రూ.2,100 వరకు పలుకగా.. ఈ ఏడాది కేవలం రూ.1,100 నుంచి రూ.1,300 లోపే దక్కడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. మిర్చి గతేడాది క్వింటాల్ రూ.26 వేల నుంచి రూ.34 వేలు దాకా పోగా, ఈ ఏడాది రూ.16 వేల నుంచి రూ.18 వేలు దాకా ఉంది. నాణ్యమైన మిర్చి అయితే రూ.25 వేలు దాకా పలికింది. కంది, మినుములాంటి పంటలు కూడా ధరలు పడిపోవడంతో రైతులు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇదిలా ఉండగా ఆత్మకూరు, శ్రీశైలం నియోజకవర్గం పరిధిలోని అన్నదాతలు పండించిన వరి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పార్టీలకు అతీతంగా రైతులు బండిఆత్మకూరు, వెలుగోడు మండలాల్లో రోడ్డెక్కి వరి పంటకు మద్దతు ధర కల్పించాలని నిరసన వ్యక్తం చేశారు.

10 ఎకరాల్లో మొక్కజొన్న వేసి నష్టపోయా



ఈ ఏడాది పది ఎకరాల్లో మొక్కజొన్న పంటను వేశా. వేసిన పంటంతా ఏపుగా పెరిగింది. ఉన్నఫలంగా అధిక వర్షాలకు నీరు భారీగా నిల్వ ఉండడంతో పంట నేలకొరిగింది. అరకొరగా పండిన మొక్కజొన్న పంట తడిసి ముద్దవడంతో ఆర్థికంగా నష్టపోయా. పది ఎకరాల్లో పంట సాగుచేయగా, దాదాపు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల దాకా నష్టం వచ్చింది. రైతులకు ఈ ఏడాది ఏ పంట వేసినా నష్టం తప్పా లాభం కనిపించడం లేదు. – విజయ్, ఆత్మకూరు రైతు

సోయాబీన్ రెండు సార్లు వేశా



ఈ యేడాది రబీ సీజన్ ప్రారంభంలో రెండుసార్లు సోయాబీన్ విత్తనం వేశాను. మొదటి సారి సోయాబీన్ పంట పూర్తిగా విత్తనాలు నాణ్యత లేక మొలకెత్తలేదు. దీంతో పొలం దున్నేసి మళ్లీ మినుము పంటనే వేశాను. ఇలా రెండుసార్లు పంటలు వేయడం వల్ల ఆర్థికంగా నష్టపోయా. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.40 వేల దాకా నష్టం వచ్చింది. ఏడాది రైతులకు అచ్చు రాకుండా కాలం గడిచింది.

– వెంకటేశ్వర్లు, ఆత్మకూరు

శివపురం గూడెంకు నీటీ సరఫరా పునరుద్ధరణ



కుళాయిలో నీరు సరఫరా అవుతున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని శివపురం గూడెంలో నీటి సరఫరాను ఆదివారం ప్రజాప్రతినిధులు, అధికారులు పునరుద్ధరించారు. శుక్రవారం సాక్షి పత్రికలో 'తాగేందుకు నీళ్లివ్వండి' శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. మరమ్మతులకు గురైన కొత్త విద్యుత్ మోటార్ స్టాటర్ సెట్టు, బీకేజీ పైపులను సుమారు రూ.20 వేలు ఖర్చు చేసి మరమ్మతులు చేయించారు. గూడెంలో ఎటువంటి నీటి సమస్య తలెత్తకుండా చూస్తామని సర్పంచు చంద్రశేఖర్ యాదవ్ తెలిపారు. వేసవిలో కూడా గిరిజనులకు నీటి ఎద్దడి లేకుండా ముందస్తుగానే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పగిడ్యాలలో కబడ్డీ శిక్షణ శిబిరం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న

పగిడ్యాల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న కోరారు. ఆదివారం శిక్షణా క్యాంప్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడలు చదువులో భాగమని, గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభకు కొదవ లేదన్నారు. అయితే శిక్షణ లేకపోతే ఎంతటి ప్రతిభావంతులైన పొరపాట్లు చేసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కబడ్డీ శిక్షణా శిబిరం క్రీడాకారులకు చక్కటి అవకాశం అన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణ, రాగన్న, సుభయ, క్రీడాశ్రీ పీతాంబరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని అధోగతిపాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్

ఆత్మకూరు: మతోన్మాదం, ఉదారవాద ఆర్థిక విధానాలను కేంద్రంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం మిళితం చేసి దేశాన్ని అధోగతిపాలు చేస్తోందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం అన్నారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో సీపీఎం జనరల్ బాడీ సమావేశాన్ని ఎస్.స్వాములు అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీడీపీ కూటమి పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ దోపిడీ విధానాలపై క్షేత్రస్థాయిలో ఉద్యమాలను ఉధృతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ పార్టీలు పూర్తిగా బీజేపీకి లొంగిపోయాయన్నారు. ప్రభుత్వం మోపిన విద్యుత్ భారాలపైన ప్రజలను సమీకరించి పోరాడాలన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు రజాక్, పుల్లమ్మ బాయి, సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని అనుసరించాలి



హిందూధర్మ ప్రచారం చేస్తున్న హిందూ జ్ఞానవేదిక ప్రచారకులు

జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని అనుసరిస్తూ హిందూధర్మ సంప్రదాయాలను అలవర్చుకోవాలని హిందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని పారుమంచాల, తంగడంచ గ్రామాల్లో ఆదివారం హిందూధర్మంపై ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో మొదటి నుంచి సనాతన ధర్మంగా హిందూధర్మం విరాజిల్లుతుందన్నారు. హిందూధర్మం ప్రకారంగా మహిళలు నడుచుకోవాలన్నారు. పాశ్చాత్య సంస్కృతి పోకడలకు పోయి మన సంప్రదాయాలను విస్మరించవద్దని సూచించారు. కార్యక్రమంలో మునిదాసు, కుమారాచారి, పుల్లారెడ్డి, సంజీవ, గిరిబాబు, చక్రపాణి, కృష్ణవేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కంది రైతులు పేర్లు నమోదు చేసుకోండి

జూపాడుబంగ్లా: ఖరీఫ్‌లో కంది పంట సాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా ఖరీఫ్‌లో కంది పంట సాగుచేసి ఈ పంట నమోదు చేయించుకున్న రైతులు ఆర్‌ఎస్‌కేలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం కందిపంట చేతికొచ్చే తరుణంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7,550ల కంటే బహిరంగ మార్కెట్లో ధర తక్కువగా ఉందన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి మార్క్‌ఫెడ్ అధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నట్లు తెలిపారు.

మహానందిలో సండే సందడి



మహానందీశ్వరస్వామి దర్శనార్థం వస్తున్న భక్తులు

మహానంది: మహానందిలో ఆదివారం సెలవురోజు సందర్భంగా భక్తుల సందడి కొనసాగింది. వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ కామేశ్వరీ దేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి కొనసాగింది. ఇదిలా ఉండగా దేవస్థానానికి చెందిన వసతి గృహాలు తక్కువగా ఉండటంతో అన్నీ నిండిపోయాయి. దీంతో భక్తులు చేసేదేమిలేక ప్రైవేట్ లాడ్జీలను ఆశ్రయించాల్సి వచ్చింది. లాడ్జీల నిర్వాహకులు ఇదే అదనుగా భావించి గదుల అద్దె ధరలను రెట్టింపు మొత్తంలో వసూలు చేస్తుండటంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

పాములపాడు: ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ సురేష్‌బాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహన చోదకుల డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఆటోల్లో ప్రయాణికులను కెపాసిటీకి మించి ఎక్కించవద్దని సూచించారు. మైనర్లు ద్విచక్రవాహనాలు నడిపితే వారి తల్లి దండ్రుల పై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాయలంలో సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తామని ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరవుతారని చెప్పారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు.

రేపటి నుంచే పింఛన్ పంపిణీ

పాములపాడు/వెలుగోడు: జనవరి నెలకు సంబంధించిన పింఛన్ ఈ నెల 31వ తేదీనే పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓలు చంద్రశేఖర్, మధుసూదన్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ముందస్తుగా పింఛన్ సొమ్ము లబ్ధిదారులకు అందజేయనున్నట్లు చెప్పారు. పింఛన్‌దారులందరూ అందుబాటులో ఉండాలని కోరారు. పాములపాడు మండలంలో 5,722 మందికి రూ.2,37,73,500 పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఘర్షణలకు పాల్పడొద్దు

పాములపాడు: ప్రతి చిన్న విషయానికి క్షణికావేశానికి లోనై ఘర్షణలకు అవకాశం ఇవ్వొద్దని ఎస్‌ఐ సురేష్‌బాబు అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని తుమ్మలూరు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవనం సాగించాలన్నారు. మద్యానికి బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఏదైనా సమస్య వస్తే పోలీసు స్టేషన్‌కు రావాలని సూచించారు. ఎవరైనా ప్రజలకు ఇబ్బందులు కలిగేలా ప్రవర్తించినా, అక్రమంగా నాటుసారా విక్రయాలు, బెల్టు దుకాణాలు నిర్వహణపై సమాచారం ఇవ్వాలని సూచించారు. పిల్లలను బాగా చదివించాలన్నారు. ఏఎస్‌ఐ ఏసయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

తైక్వాండో శిక్షణను సద్వినియోగం చేసుకోండి



ఎన్నికైన వారిని సన్మానిస్తున్న సభ్యులు

ఆత్మకూరు: పట్టణంలో గత కొంత కాలంగా కేవీకే స్టేడియంలో శిక్షకులు సామన్న, ఖాజా హుసేన్‌ల ఆధ్వర్యంలో తైక్వాండో శిక్షణ ఇస్తున్నారని, ఈ అవకాశాన్ని బాల బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇటీవలే అధికారికంగా ఎన్నికైన ఆత్మకూరు తైక్వాండో అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆత్మరక్షణ కోసం బాల్యం నుంచే తైక్వాండో శిక్షణ తీసుకోవాలన్నారు. ఈ శిక్షణ ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు ఉంటుందన్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా నాయబ్ సయ్యద్ అసదుల్లా, అధ్యక్షుడిగా ఖాజాహుసేన్, ప్రధాన కార్యదర్శిగా గొడుగు సామన్న, ఉపాధ్యక్షుడిగా షఫీవుల్లా, కార్యదర్శిగా ముర్తుజా, కోశాధికారిగా గొడుగు నాగన్న నియమితులయ్యారన్నారు. కార్యక్రమంలో జాతీయ వాలీబాల్ కోచ్ అజగర్‌అలీ, ఖోఖో శిక్షకులు మహబూబ్, కబడ్డీ శిక్షకులు నందన, వెంకటేశ్వరగౌడ్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు ఇండ్ గ్యాప్ ధ్రువీకరణ



రైతులతో మాట్లాడుతున్న ఏవో పవన్ కుమార్

వెలుగోడు: మండలంలో గుంతకందాల గ్రామంలో గత ఖరీఫ్‌లో పొలంబడి కింద సాగుచేసిన వరికి ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్ లభించినట్లు ఏఓ పవన్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇండ్ గ్యాప్ అమలుకు ×సుస్థిర వ్యవసాయ–ఆహార వ్యవస్థలు¥ అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మేలైన వ్యవసాయ పద్ధతులు ఇండ్ గ్యాప్ ధ్రువీకరణ ద్వారా అమలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఎంపిక చేసిన క్లస్టర్ మండలాలలోని రైతులకు పొలంబడి అను రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించి రైతులకు గ్యాప్ సర్టిఫికేషన్ పై పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ ధ్రువీకరణ పత్రాన్ని పొందడానికి వ్యవసాయ విస్తరణ సిబ్బంది అంజిత్ కుమార్ రెడ్డి, గుంతకందాల గ్రామ వ్యవసాయ సహాయకులు అప్సర అలీ, పొలంబడి రైతులు ఎంతో కృషి చేశారన్నారు.

దోమలు బాబోయ్..!



నాగనంది వసతి గృహాల వద్ద దోమలకు పొగబెట్టిన దృశ్యం



ఆలయ పరిసరాల్లో దుకాణం వద్ద దోమల నివారణ కోసం పొగ

- మహానందిలో దోమల బెడద
- చీకటి పడితే చాలు బెంబేలెత్తుతున్న భక్తులు
- ఫాగింగ్ చేయించని అధికారులు

మహానంది: అసలే నల్లమల అడవి ప్రాంతం. ఆపై ఆలయ పరిసరాల్లో పారిశుధ్య లోపం వెరసి దోమలు విలయతాండవం చేస్తున్నాయంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహానంది ఆలయ పరిసరాల్లో కాసేపు నిలబడదామంటే చాలు దోమలు కుడుతుంటే భక్తులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. మహానంది ఆలయానికి నిత్యం రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారు. దీనికి తోడు దేవస్థానానికి చెందిన వసతి గృహాల్లో, చుట్టుపక్కల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో దోమలు మరింత అధికంగా ఉన్నాయి. వసతిగృహాల వద్ద, ఆలయ పరిసరాల్లో దోమల తీవ్రత తగ్గించుకునేందుకు కొందరు పొగబెడుతూ భక్తులకు కాస్త ఉపశమనం కలిగిస్తున్నారు. కానీ ఆలయ ప్రాంగణాల్లో పదినిమిషాలు కూర్చుందామంటే కూడా కుదరకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయానికి ఏడాదికి రూ.18 కోట్లు ఆదాయం వస్తున్నప్పటికీ భక్తులను కల్పించాల్సిన సౌకర్యాల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించడం విమర్శలకు తావిస్తోంది. కొన్నేళ్ల క్రితం దోమల తీవ్రత తగ్గించేందుకు అప్పటి అధికారులు రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్లు ఎక్కడున్నాయో సైతం తెలియని పరిస్థితి. ఫాగింగ్ మిషన్లు ఉంటే రోజుకు రెండు సార్లయినా ఫాగింగ్ చేయిస్తే దోమల తీవ్ర కాస్తయినా తగ్గుతుందని భక్తులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఆదాయమే కాకుండా భక్తుల అవస్థలపై సైతం అధికారులు దృష్టి సారించాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నంద్యాల(వ్యవసాయం): ప్రయాణికుల సౌకర్యార్థం మెరుగైన సేవలు అందించడంలో భాగంగా సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ రావు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ప్రయాణికులు డిపో పరిధిలో తమ సమస్యలు, సలహాలు, సేవలపై సెల్ నంబర్ 73828 70767కు ఫోన్ చేసి తెలపవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిరుపయోగంగా మినీ ట్యాంకులు



నాగేశ్వరరెడ్డి ఇంటి వద్ద నిరుపయోగంగా ఉన్న మినీ ట్యాంక్

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో నాగేశ్వరరెడ్డి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన మినీ నీళ్ల ట్యాంక్ నిరుపయోగంగా మారింది. ప్రజల దాహార్తిని తీర్చడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంచాయతీ నిధులతో మినీ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ట్యాంకు ఏడాది కాలంగా నిరుపయోగంగా మారడంతో స్థానికులు నీటి అవసరాలు తీరక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంక్ కనిపించకుండా దోస తీగ అల్లుకుపోయినా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన మంచినీటి ట్యాంక్‌కు పంచాయతీ అధికారులు పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వలేదని స్థానికులు వాపోయారు. అదేవిధంగా గ్రామంలో గోరంట్ల ఎస్సీ కాలనీలో చర్చి వద్ద కూడా మినీ ట్యాంక్ నిరుపయోగంగా ఉందని అయినా పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహించడం వలన గొంతెండి అల్లాడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి తిరుణాల సమీపిస్తోందని ఇళ్లకు బంధువులు, ఆడపడుచులు వస్తారని, అధికారులు స్పందించి పైప్‌లైన్ కనెక్షన్ ఇచ్చి ట్యాంక్‌లను ఉపయోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.